

4న తపాలా ఉద్యోగుల ఒక రోజు సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ తపాలా ఉద్యోగుల కేంద్ర, రాష్ట్ర సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా అక్టోబర్ 4న జరిగే ఒకరోజు సమ్మెను జయప్రదం చేయాలని కాండ్రకోట పోస్ట్ మాస్టర్ అడ్డగర్ల సురేంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన ఉద్యోగుల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటల పని దినాలు కల్పించాలని, పెన్షన్ సౌకర్యం కలగజేయాలని, అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత ఇచ్చే బెనిఫిట్స్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, ఉద్యోగులకు వైద్య సౌకర్యం కల్పించాలని, టార్గెట్లు, మేళాల పేరుతో వేధింపులు నిలుపుదల చేయాలనే డిమాండ్లతో ఈ సమ్మె నిర్వహిస్తున్నామన్నారు.

కౌలు గుర్తింపు కార్డులపై నిర్లక్ష్యం

- గుర్తింపు కార్డుల జారీలో నిర్లక్ష్యం
- సిసిఆర్ కార్డులున్నా అందని రుణాలు
- 17 వేల మందికిపైగా ఎదురు చూపులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వాస్తవ సాగుదారులైన కౌలు రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఇంకా కొనసాగుతూనే ఉంది. పాలకుల పట్టించుకోనితనం, అధికారుల అలసత్వం వెరసి సర్కారు సాయానికి నోచుకొని దుస్థితిలో వారున్నారు. కాకినాడ జిల్లాలో 2.20 లక్షల మంది రైతులకు గాను 1.70 లక్షల మంది కౌలు రైతులే న్నారు. ఎక్కువ సంఖ్యలో వీరే ఉన్నారని అధికారులే గుర్తించినా సిసిఆర్ కార్డుల జారీలో మాత్రం పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తోంది. లక్ష్యాన్ని నిర్ధేశించడంలోనే లోపం కొట్టొచ్చినట్లు స్పష్టమవుతోంది. జిల్లాలో కేవలం 54 వేల మందికి మాత్రమే కార్డులు ఇవ్వాలని భావించారు. అంతా గగ్గోలు పెట్టడంతో మొత్తంగా 57, 319 మందికి వీటిని జారీ చేశారు. మిగిలిన వేలాదిమంది రైతులకు అన్యాయం జరిగింది. ఏటా ఇదే పరిస్థితి ఉంటోంది. ప్రతి సంవత్సరం ప్రకృతి వైపరీత్యాల వల్ల, తెగుళ్ల దాడితో పంటలు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రైతు భరోసా, పిఎం కిసాన్, పంటల నష్టపరిహారం, రుణాలు వంటి సాయలను పొందలేకపోతున్నారు. చివరకు ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధరను పొందలేక తక్కువ ధరకే దాన్యాన్ని దళారులకు అమ్ముకోవడానికి సిద్ధ పడుతున్నారు. ఇలా అన్ని అంశాల్లోనూ కౌలు రైతులు నష్టపోతున్నారు.



గుర్తింపు కార్డుల కోసం చేపట్టిన జాతా (ఫైల్ ఫొటో)

రుణాలు ఇవ్వడంలో జాప్యం

సిపిఆర్ కార్డు కౌలు రైతు రుణం పొందడానికి అర్హత ధ్రువీకరణగా ఉండాలి. కానీ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే కేవలం పేరుకు మాత్రమే అన్నట్టు మారిపోయింది. ప్రభుత్వం కౌలు రైతులకు సాగులో సాయం అందించేందుకు బ్యాంకు రుణాల కేటాయింపునకు లక్ష్యం నిర్ధేశించినా అమలు కావడం లేదు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో రుణాలు మంజూరు చేయలేదు. వాస్తవానికి ఖరీఫ్ పనులు ప్రారంభానికి ముందే రుణాలు ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులు వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులకు పదే పదే చెబుతున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరాకు రూ.38 వేలు రుణంగా ఇస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 39 వేల మందికి మాత్రమే రుణాలు ఇవ్వగలిగారు. వీటిలో 30 వేల కార్డులకు రూ.109 కోట్లు, నాలుగు నుంచి ఆరుగురున్న జెఎల్‌జి గ్రూపులు 1020 ఉండగా వీటికి కేవలం రూ.26.23 కోట్లు రుణాలు మాత్రమే ఇచ్చారు. ఇంకా వేలాది గ్రూపులను ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాల్సి ఉంది. సిసిఆర్ కార్డులు పొందిన 17 వేల మందికి పైనే రుణాలు ఇవ్వాల్సి ఉంది. ఈ ఖరీఫ్ మరి కొద్ది రోజుల్లోనే ముగుస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో రుణాలు మంజూరు కాక కౌలు రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్నారు. ఎటువంటి సాయాలు అందక చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలని కౌలు రైతులు వేడుకుంటున్నారు.



వాస్తవా సాగుదారులకు అన్యాయం

జిల్లాలో వేల మంది కౌలు రైతులు వాస్తవ సాగుదారులుగా ఉన్నా ప్రభుత్వం ఎందుకు వారిని నిర్లక్ష్యం చేస్తోందో అర్థ: కావడం లేదు. సిసిఆర్ కార్డులు ఇవ్వడంలోనే అన్యాయం చేస్తున్న తీరు సరికాదు. కార్డులు ఇచ్చినా పూర్తిస్థాయిలో రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం శోచనీయం. నిబంధనల్లో సడలింపు ఇచ్చి సాగుదారులందరికీ రుణాలు మంజూరు చేయాలి.

- వి. రాజబాబు, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి.

సిఎం పర్యటన విజయవంతానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్, పెద్దాపురం

5వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ సామర్లకోట పర్యటనను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో సమగ్రంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, సిఎం పర్యటనల సమన్వయ్యకర్త తలశిల రఘురామ్‌లు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ అధ్యక్షతన సిఎం పర్యటనపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసిన ఇటిసి లేఔట్‌ను పరిశీలించారు. అనంతరం పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తలశిల రఘురాం, కాకినాడ ఎంపీ వంగా గీత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జెఎండి ఎం.శివప్రసాద్, కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు, ఎస్‌పి సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పాల్గొన్నారు. ప్రజలు, లబ్ధిదారులు తరలి వచ్చేందుకు అవసరమైన రవాణా వాహనాలను ఏర్పాటు చేయాలని డిటిసిని ఆదేశించారు. వాహనాల రూట్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బందోస్తు ఏర్పాటలను పోలీస్ శాఖకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో రోడ్ షో, బహిరంగ సభల వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటుకు రోడ్లు భవనాల ఎస్ఇని ఆదేశించారు. హెలిపాడ్, రోడ్ షో, బహిరంగ సభల వద్ద అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు, కాన్వాయ్‌లో వైద్యాధికారులతో కూడిన అంబులెన్స్ ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఒకు సూచించారు. బహిరంగ సభ నిర్వహణకు వేదిక, సభాప్రాంగణం ఏర్పాట్లను కుడా విసి చేపట్టాలని చెప్పారు. తలశిల రఘురాం మాట్లాడుతూ సియం పర్యటనకు హాజరైయ్యే ప్రజలు, లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సదపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. తొలుత సిఎం సామర్లకోటలో పర్యటించే ప్రదేశాలను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.శ్రీధరరెడ్డి, ఎఎస్‌పి పి.శ్రీనివాస్, హౌసింగ్ పీడీ సుధాకరపట్నాయక్, కాకినాడ ఆర్‌డిఒ ఎన్.వివి.సత్యన్నారాయణ, పెద్దాపురం ఆర్‌డిఒ జె.సీతారామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, యండిఓలు, మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న తలశిల రఘురాం, కలెక్టర్, ఎస్‌పి

104 ఉద్యోగులకు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-కాకినాడ

104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కమిటీ సమావేశం సిఐటియు జిల్లా కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 104 ఉద్యోగులు ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. మారుమూల ప్రాంతాల్లో పేద ప్రజలుకు వైద్య సేవలు అందించడంలో 104 ఉద్యోగులు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీకాంత్ మాట్లాడుతూ 104 సేవలను ప్రభుత్వమే గతంలో మాదిరిగా నిర్వర్తించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు మాట్లడుతూ పెండింగ్ వేతనాలు వెంటేనే చెల్లించి, 104 ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలన్నారు. ఈ సమావేశంలో సిహెచ్.సంతోష్, జి.విజయ్ కుమార్, ఆర్.హరిప్రసాద్, పి.స్వర్ణతేజ పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న 104 ఉద్యోగులు

కొనసాగిన టిడిపి రిలే నిరాహార దీక్షలు

చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు నిరసనగా ఆదివారం పలుచోట్ల నిరసన దీక్షలు కొనసాగాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ కార్పొరేషన్ కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు, మాజీ ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు బాలాజీ చెరువు సెంటర్‌లో రిలే దీక్షలన ప్రారంభించారు. పిర్ల లక్ష్మీ ప్రసన్న, చొక్కా గిరి, బొడ్డు శివాజీ, గొరుసు దుర్గారావు, చింతపల్లి తాతారావు, అంగాడి దుర్గారావు, సీకోటి సింగ్, తాడి శ్రీను, అరదాడి శివ, వాసిరెడ్డి చిట్టిబాబు, కామాడి సుబ్బారావు, బలసాడి శ్రీను, బత్తుల ఉమాదేవి, గంటి కుసుమ కుమారి, వాసిపిల్లి మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** మండలంలోని పెదబ్రహ్మదేవంలో తోటకూర శ్రీనివాస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ ఆందోళనలో నిమ్మకాయల రంగనాగ్, పాలకుర్తి శ్రీను బాబు, గుమ్మళ్ల రామకృష్ణ, ఆకునూరి సత్తిబాబు, మార్ని భద్రం, కంటిపూడి అయ్యన్న ప్రసాద్. మామిడాల రామకృష్ణ, లొల్ల శ్రీను, దడాల నాగరాజు, కొత్తెం కోటి, బడుగు శ్రీకాంత్, రంధి సత్యనారాయణ, తూతిక రాజు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** వలసపాకల సెంటర్‌లో దీఓలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిలి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మి పాల్గొన్నారు. ఈ రిలే నిరాహారదీక్షకు జనసేన నాయకులు మద్దతు తెలిపారు.


కాకినాడ రూరల్‌లో..

వైసిపి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-గండేపల్లి

ఏ ప్రభుత్వం అందించని విధంగా వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన గండేపల్లిలో తొండాపు రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నరసింహం మాట్లాడుతూ వైఎస్.జగన్‌ను ప్రజలంతా రెండోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. తాను ఎంఎల్ఎగా, మంత్రిగా, ఎంపీగా జగ్గంపేట నియోజకవర్గానికి అనేక సేవలందించాలని చెప్పారు. రైతులకు గోదావరి జలలాలను అందించడం తోపాటు, ఏలేరు గోదావరి జలాలను ప్రత్యేక పైపులైన్ల ద్వారా నియోజకవర్గం అందరికీ, అన్ని గ్రామాకూ తాగునీరు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట రామ్‌జీ, అత్తులూరి సాయిబాబా, రామకృష్ణ, శ్రీరామచంద్రమూర్తి, గుళ్ల ఏడుకొండలు, తొండపు రఘురాం ప్రసాద్ బోదా రామారెడ్డి, కోర్పు దుర్గాప్రసాద్, పరిమి వెంకటేశ్వరరావు నిమ్మలపూడి శ్రీనివాస్, సుంకుమిల్లి ఎల్లయ్య, మరుకుర్తి పెద్దరాజు రాంబాబు వైసిపి కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తోట నరసింహం

భారత సంగీతానికి వేల సంవత్సరాల చరిత్ర

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

భారతీయ సంగీతానికి వేలాది సంవత్సరాల చరిత్ర ఉందని సంగీత విద్వాంసురాలు చావలి సూర్యకుమారి పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సంగీత దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగీతం ప్రకతి నుంచి ఉద్భవించిందని అన్నారు. ప్రపంచ దేశాల్లో సంగీతం పట్ల ఆసక్తి పెరగడం శుభ సూచికమన్నారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో సూర్య కుమారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త శిరీష, రవిశంకర్ పట్నాయక్, చింతపల్లి సుబ్బారావు, పార్ధసారథి, ఎస్.శ్రీనగేష్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రేలంగి బాపిరాజు, అడబాల సత్యనారాయణ, రామారావు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పాఠశాల విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవడం ద్వారానే విజ్ఞానవంతులు కాగలరని కాకినాడ, గాంధీనగర్ మహాత్మా గాంధీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తురగా శ్రీనివాస్ అన్నారు. గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయంలో గల దినపత్రికలు, ఇతర సాహిత్య పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానవంతులు అవుతారని హెచ్‌ఎం చెప్పారు. లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లు, ఇంటర్నెట్ ద్వారా విన్న, చూసిన దానికన్నా పుస్తకాలు చదవడం ద్వారా మంచి విజ్ఞానవంతులు కాగలరన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛతాహి సేవ

స్వచ్ఛతా హి సేవలో భాగంగా ఆదివార ఏక్ తారీఖ్ ఏక్ ఘంటే కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కార్పొరేషన్ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు పర్యవేక్షణలో బోట్ క్లబ్, అన్నమ్మ ట్యాంక్ వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కుడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎఎంసి చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితర ప్రముఖులు హాజరయ్యారు. నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఇ వెంకట్రావు, ఎంహెచ్ఒ డాక్టర్ పథ్వీ చరణ్, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీరెడ్డి, ఇఇ మాధవి, పాల్గొన్నారు. స్మార్ట్ సిటీ కార్యాలయంలో కమిషనర్ నాగనరసింహారావు అధ్యక్షతన స్వచ్ఛభారత్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సభలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ మాట్లాడారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, ఎఎంసి చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఇఇ మాధవి, టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్ పాల్గొన్నారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా సహకారం అందిస్తున్న ఒఎన్‌జిసి ప్రతినిధి డాక్టర్ రవీంద్ర ఆరికేటిని సత్కరించారు. **కాకినాడ రూరల్** రమ్య హాస్పిటల్ అధినేత, అన్నవరం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పితాని అన్నవరం కాకినాడ బీచ్‌లో స్వచ్ఛ భరత్ నిర్వహించారు. **గండేపల్లి** మండలం ఎన్.టి.రాజాపురంలో జెడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. మురారిలో వైసిపి యువ నాయకుడు జాస్తి వసంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి చలగళ్ల దొరబాబు, ఎన్.టి.రాజాపురం సర్పంచ్ బిక్కిన గంగాభవాని గంగాధర్, మురారి సర్పంచ్ కుక్కల ఆనందబాబు, ఇఒపిఆర్‌డి మూర్తి, సెక్రటరీ తరంగిణి, **సామర్లకోట రూరల్** పెదబ్రహ్మదేవంలో ఎంపిటిసి మలకల సూర్యారావు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రమదానంలో డిపిఒ విక్టర్, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు మలకల వరాల బాబు, కర్రి హరికష్ణ సత్యారెడ్డి, తోటకూర గంగాధర్ పాల్గొన్నారు. బచ్చు ఫౌండేషన్ హైస్కూల్లో హెచ్‌ఎం తోటకూర సాయి రామకష్ణ, రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక శాఖా గ్రంథాలయంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల పీడీ అప్పారావు, వానపల్లి సత్యనారాయణ, లచ్చి, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. **పిఠాపురం** కోర్టుల ప్రాంగణంలో స్వచ్ఛతహి సేవా కార్యక్రమం 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి, ఎ.శిరీష, మేరుగ రాజారావు, కెఎస్ఆర్.భాస్కర్, ఎపిపి ఎకెవై.రెడ్డి పాల్గొన్నారు. **కరప** మండలంలోని పలు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించినట్టు ఇఒపిఆర్‌డి పివి.శ్రీనివాసరావు తెలిపారు. నడకుదురు పంచాయతీలో సర్పంచ్ దేగల లలిత కుమారి, పంచాయితీ కార్యదర్శి బ్రహ్మానందం, పిహెచ్‌సిలో డాక్టర్ శ్రీనివాస్ నాయక్, హైస్కూల్లో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, భీమన్న, పైల గోవింద పాల్గొన్నారు.


కాకినాడలో..


గండేపల్లిలో..

సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించి చేయాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఒక వ్యక్తి జీవితంలో రక్తం ఆవశ్యకత, ప్రాముఖ్యతను పంచుకోవడానికి గాను 1975 నుండి అక్టోబర్ 1న మన భారత దేశంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. గాయాలు, శస్త్ర చికిత్సల సమయంలో ప్రాణాలు నిలపడానికి రక్తం అవసరమని అన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో రక్త దాతలు కృష్ణమోహన్, ధర్మవరపు రాజశేఖర్, సిగిరెడ్డి రత్న కిషోర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శిరీష, చింతపల్లి సుబ్బారావు, అడబాల సత్యనారాయణ, ఎస్. శ్రీ నగేష్, రాజా, రామారావు, పార్ధసారథి, రవిశంకర్ పట్నాయక్, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రఘుపతి వెంకటరత్నంకు ఘన నివాళి

ప్రముఖ సంఘసంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడు 161 జయంతి సందర్భంగా ఆయనకు ఆదివారం పలువురు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానం వద్ద గల వెంకటరత్నం నాయుడు విగ్రహానికి పలువురు ప్రజా సంఘాల నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వాసిరెడ్డి ఏసుదాసు, బాబ్జీ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.నాగేశ్వరరావు, ఐద్వా నాయకురాలు సిహెచ్.రమణి, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, యుటిఎఫ్ నాయకులు మధు కుమార్, జెవివి నాయకులు యు.సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకుడు జైరామ్, కె.వీరబాబు, పి.రామకృష్ణ, వి.చంద్రరావు, ఎవి.కృష్ణాజీ, మేడిశెట్టి వెంకట రమణ పాల్గొన్నారు. బోట్ క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శిరీష, అడబాల రత్న ప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, చింతపల్లి సుబ్బారావు, అడబాల సత్యనారాయణ, బుద్ధరాజు సత్యనారాయణరాజు, ఎస్‌వి.రమణమూర్తి, రాజా, కొమ్మూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **కాకినాడ కార్పొరేషన్** బాలాజీ చెరువు సెంటర్‌లో గౌతమ్, జవహర్, మోకా పవన్ కుమార్, ఇందిరా మురళి, అరవ మణికంఠ మహేష్ పాల్గొన్నారు.



కాకినాడలో..



స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన..

వృద్ధుల పట్ల అందరూ ప్రేమతో మెలగాలి

వృద్ధుల పట్ల అందరూ ప్రేమతో మెలగాలని పలువురు సూచించారు. పలుచోట్ల ఆదిఆవరం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ కార్పొరేషన్ స్థానిక ఈశ్వర్ నగర్‌లోని వాత్సల్య వృద్ధుల సంక్షేమ ఆశ్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యాన దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇండియన్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు వైడి.రామారావు, ముంజులూరి విశ్వేశ్వరయ్య మాట్లాడారు. అపోలో ఆసుపత్రి నాగార్జున అందరికీ పండ్లు పంపిణీ చేసారు. **కాకినాడ రూరల్** రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన దినోత్సవంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు మాట్లాడారు. అడబాల రత్న ప్రసాద్ సౌజన్యంతో వద్ధులకు నూతన వస్త్రాలు బహుకరించారు. రేలంగి బాపిరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి.రమణమూర్తి, డిఇ సత్యనారాయణ, డి.రామకృష్ణ, శిరీష, రవిశంకర్ పట్నాయక్, పార్ధసారథి, చింతపల్లి సుబ్బారావు, ఎస్.శ్రీనగేష్, రామారావు, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** ఆర్‌డిఒ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులను కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ఘనంగా సన్మానించారు. ఆర్‌డిఒ జె.సీతారామారావు, తహశీల్దారు జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బళ్లమూడి సూర్యనారాయణమూర్తి, ఫౌండేషన్ అధ్యక్షుడు, పిఎల్.రాజు, సెక్రటరీ అల్లం వీరబాబు, సిహెచ్.ఏడుకొండలు, వి.సత్తిబాబు, పిజి.కుమార్ పాల్గొన్నారు.


పెద్దాపురంలో..



కాకినాడలో..

నేరాలు ఘోరాలు

కాల్వలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కాలువలో స్నానం చేస్తూ ప్రమాదవశాస్తు మునిగిపోయి ఒక వ్యక్తి చనిపోయిన సంఘటన మండలంలోని అంకంపాలెంలో చోటు చేసుకుంది పోలీసు వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన కరుటూరి శ్రీరామ ప్రసాద్ (40) ఆదివారం ఉదయం గ్రామ శివారులో ఉన్న శివాలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లాడు పక్కనే ఉన్న కాలువలోకి స్నానానికి దిగాడు ప్రమాదవశాస్తు మునిగి పోయి మృతి చెందాడు దీనిపై, భార్య వెంకట దుర్గ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు.

పురుగు మందు తాగిన బాలుడు మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

తండ్రి మందలించడంతో, మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన సాధనాల గోవింద్ (15) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గోదావరిపై ఉన్న గ్యామన్ ఇండియా బ్రిడ్జిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందారు. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలు.. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం అర్తమూరుకు చెందిన నిడదవోలు రమణ తన భార్య వీరలక్ష్మి (32), కుమారుడు వెంకట్‌తో కలిసి బైక్‌పై దేవరపల్లి మండలం గౌరీపట్నం బయల్దేరారు. వీరి బైక్‌ను ఓవర్ టేక్ చేయబోయిన లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో వీరలక్ష్మి అక్కడికక్కడే మతి చెందింది. కుమారుడు వెంకట్‌కు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఎంపి మార్గాని భరత్ రామ్ ఆగి అంబులెన్స్‌కు ఫోన్ చేసి హుటాహుటీనా ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి వంతెన సమీపంలో జాతీయ రహదారి 216పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోరంగి పంచాయతీ బొడ్డు చినవెంకటాయపాలెం గ్రామానికి చెందిన పాలెపు సత్తిబాబు (32) కాకినాడ నుంచి బైకుపై వస్తుండగా యానాం వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం

డిఎం అండ్ హెచ్ఒ నరసింహ నాయక్





ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వర్షాకాలం వాతావరణంలో మార్పులు, పరిసరాల అపరిశుభ్రత వంటి కారణాలతో వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి మెరుగైన వైద్య చికిత్స పొందడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నరసింహ నాయక్ పేర్కొన్నారు. కాలానుగుణ వ్యాధుల నివారణ, చికిత్సలపై ఆయన వివరించారు.

జిల్లాల్లో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. 140 పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. ముందుగా గ్రామంలోని ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలను సంప్రదిస్తే ప్రాథమిక చికిత్స అందిస్తారు. ఆరోగ్య ఉపకేంద్రాలకు వెళితే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. కలుషితమైన నీరు లేదా ఆహారం తీసుకోవడం వల్ల ఇలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. నీరసంగా ఉంటే అవసరమైతే ఆసుపత్రిలో జాయిన్ చేసుకొని మెరుగైన వైద్య అందిస్తారు.

మలేరియా, టైఫాయిడ్ నిర్ధారణకు పరీక్షలు ఎక్కడ చేస్తారు. ఫలితాలు ఎప్పుడు వస్తాయి.

గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో ప్రాథమికంగా జ్వరాలకు మందులు ఉచితంగా ఇస్తారు. జ్వరం తగ్గనట్లయితే లక్షణాల మేరకు మలేరియా సంబంధించి రెండు రకాల పరీక్షలు ఉంటాయి. మొదటగా ఆర్‌టిపిసిఆర్ చేసి వెంటనే చెబుతారు. అనుమానముంటే రక్తనమూనా సేకరించి ల్యాబ్‌కు పంపిస్తారు. టైఫాయిడ్ నిర్ధారణకు కూడా రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డయాగ్నస్టిక్ సెంటర్‌కు పంపిస్తారు. మరుసటి రోజే ఫలితం వస్తుంది. రోగి చరవాణికి కూడా సమాచారం వస్తుంది.

రెండుసార్లు కరోనా పాజిటివ్ వచ్చినా మరోసారి వస్తే ఏమైనా ప్రమాదం ఉంటుందా.

రెండుసార్లు పాజిటివ్ వచ్చినా వారిలో ఉన్న రోగ నిరోధక శక్తిని బట్టి కొందరు ఆరోగ్యంగా ఉంటారు. మరికొందరు బలహీనంగా కనిపిస్తారు. పౌష్టికాహారం, పండ్లు తీసుకోవాలి. అజాగ్రత్తగా ఉంటే కరోనా పలుమార్లు రావచ్చు. ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. వైద్యులను సంప్రదించడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

జ్వరం వచ్చి నీరసంగా ఉన్నా.. ప్లేట్ లెట్లు తక్కువగా ఉన్నా..ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స చేస్తారా

ప్లేట్లెట్స్ తక్కువగా ఉన్నాయని భయాందోళన వద్దు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరితే చికిత్స ప్రారంభిస్తారు. అన్ని రకాల వ్యాధులకు మెరుగైన చికిత్స అందిస్తున్నాం.

కాలానుగుణ వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలి. నిరుపయోగంగా ఉన్న కుండీలు, టైర్లు, ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు నిలువకుండా చూడాలి. దోమలు నిర్మూలించే చర్యలు తీసుకోవాలి.

చిన్న పిల్లల విష్యంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు ఏమిటి

వర్షాలు ఎక్కువగా పడుతున్నందున చిన్న పిల్లల రోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వేడి చేసి చల్లార్చిన నీటినే తాగించాలి. వాంతులు, విరేచనాలు అయితే పిల్లలు నీరసపడకుండా చూసుకోవాలి. రెండు, మూడు రోజుల్లో జ్వరం, జలుబు తగ్గకపోతే డాక్టర్ దగ్గరికి వెళ్లాలి.

తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



మాట్లాడుతున్న పల్లం రాజు

పంతం పద్మనాభం స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగే 22వ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు ఆదివారం సూర్యకళామందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత నీలకంఠ నృత్యనికేతన్ కాకినాడ వారి ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు జరిగాయి. అనంతరం రాత్రి ఆకాశం శ్రీరామచంద్రమూర్తి కళాప్రాంగణాన్ని డాక్టర్ చెలికాని స్టాలిన్ ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి బుర్రా పద్మనాభం అధ్యక్షతన జరిగిన సభలో సంస్థ అధ్యక్షుడు, మాజీ కేంద్ర మంత్రి ఎంఎం.పళ్లంరాజు, ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి, రాయప్రోలు భగవాన్, పంతం గాంధీమోహన్, పంతం నెహ్రూ, మార్ని జానకిరామ్ చౌదరి, బోణం వెంకట భాస్కర్, సరస్వతి గానసభ కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, పంతం పద్మనాభం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుర్రా పద్మనాభం మాట్లాడుతూ పంతం పద్మనాభం ప్రోత్సాహంతో ఆయన సాధనకోసం సంస్థను ప్రారంభించి, గత 24 సంవత్సరాలుగా నిర్విరామంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో కళాకారులు, రంగస్థల కళారంగాన్ని ప్రోత్సహించడమే తమ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పంతం పద్మనాభం గ్రామాల్లో కళాకారులను ప్రోత్సహించి, ఎంతగానో ఆదరించేవారన్నారు. ఆయన స్ఫూర్తిని బుర్రా పద్మనాభం కొనసాగించడం ఎంతో అభినందనీయమన్నారు.

క్లాప్ మిత్రలకు కలెక్టర్, ఎంపీ సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్


క్లాప్ మిత్రలతో తేనీరు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

పరిశుభ్రవంతమైన సమాజం కోసం ఆరోగ్యవంతమైన జీవితం కోసం స్వచ్ఛత ఈ సేవ శ్రమదానం ప్రతి ఒక్కరూ ఉద్యమంలో చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, కాకినాడ ఎంపీ వంగా గీత పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు స్వచ్ఛతాహి సేవ శ్రమదానం, క్లాప్ మిత్రలకు సత్కారం, క్లాప్ మిత్రలతో తేనీ టి విందు వంటి కార్యక్రమాల్లో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఎంపీ వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తదితరులు అచ్చంపేట గ్రామ పంచాయితీలో ఆదివారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం చేపట్టారు. అనంతరం క్లాప్ మిత్రలకు సన్మానం చేసి, కాఫీ విత్ క్లాప్ మిత్రా, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ రమణారెడ్డి, డిఎల్‌డిఒ పి.నారాయణ మూర్తి, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, ఇఒపిఆర్‌డి కె.హరికృష్ణ సత్యారెడ్డి పాల్గొన్నారు.

జోరుగా అన్నదానాలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

వినాయక చవితి నవ రాత్రుల ముగింపును పురస్కరించుకుని ఆదివారం జోరుగా అన్నదానాలు నిర్వహించారు. తొలుత సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాదాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, టిడిపి నాయకులు గుమ్మళ్ల రామకృష్ణ, చల్లా బుజ్జి ప్రారంభించారు. సుమారు 1000 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. గణేష్ కాలనీలో కౌన్సిలర్ మర్రి శేషారావు, పాలిక చంటిబాబు ఆధ్వర్యంలో 500 మందికి భోజనాలు అందజేశారు.

సిపిఎంపై సజ్జల వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి-పిఠాపురం

సిపిఎం, కమ్యూనిస్టులపై ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని సిపిఎం నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక నండూరి ప్రసాదరావు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు సిద్ధాంతపరంగా పనిచేస్తారు తప్ప ఎవరికీ తాబేదారులుగా పని చేయరని హితవు పలికారు. కమ్యూనిస్టు భావజాల కుటుంబం నుంచి వచ్చి ఉన్నతమైన పదవిలో ఉన్న సజ్జలకమ్యూనిస్టు సిద్ధాంతాలు పూర్తిగా తెలుసుకొని మాట్లాడాలి తప్ప ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ కుంచే చిన్న, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, కె.నాగేశ్వరరావు ఉన్నారు.

రోటరీ సహకారంతో వైద్య శిబిరం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం రోటరీ క్లబ్ అధ్యక్షులు యడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచితంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మెడికవర్ హాస్పటల్ సహకారంతో ప్రాజెక్ట్ ఆన్‌పాజిటివ్ హెల్త్ ద్వారా రోగులకు వైద్య నిపుణులు వంశీకృష్ణ, రాజేష్ బిపి, సుగర్, వయసును బట్టి బరువు, ఎత్తు గుండెకి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కొండా వేణుగోపాల్‌రావు, అరగల తాతయ్య, జి.వెంకట్, డాక్టర్ శ్రీకాంత్, కేశవరాజు, డి.శంకర్, బి.భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - ఆలమూరు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలో బూత్ లెవల్ అధికారులు ఆధ్వర్యంలో 80 ఏళ్ల వద్ధులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆలమూరులో పంచాయతీ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఐపి.శెట్టి సమక్షంలో, జొన్నాడలో సర్పంచ్ కట్టా శ్రీనివాస్, పెదపళ్లలో సొసైటీ చైర్మన్ నెక్కంటి బుజ్జి సమక్షంలోనూ వృద్ధులను సత్కరించారు. పూలమాలతో ఘనంగా సన్మానించి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు నాతి కుమార్‌రాజా, మెహర్ ప్రసాద్, లోవ సత్యనారాయణ, విఆర్‌ఒలు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పెద్దాపురం

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షునిగా వేముల అర్జున్ రావు, ఉపాధ్యక్షునిగా గుండేపల్లి బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా కడకుదిటి వెంకట శివ సుధాకర్, సహాయ కార్యదర్శిగా ధవళేశ్వరపు సత్తిబాబు, కోశాధికారిగా ముండూరు వెంకట్రావు, ప్రమాణ స్వీకారం చేశారు. తాళాబత్తుల సాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్, గడిగట్ల సత్తిబాబు, ఎన్.సూరిబాబు, కోరుకొండ వరహాలరావు, సింహాద్రి కామేశ్వరరావు, కోరుకొండ విజయ్, టి.రాజా, చిట్టిమోజు శ్రీను, లక్ష్మీనారాయణ, కింతాడ శ్రీను, ప్రశాంత్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం రహిత సమాజం కోసం ర్యాలీ

ప్రజాశక్తి-పిఠాపురం


మద్యానికి వ్యతిరేకంగా నినదిస్తున్న మహిళలు

గోకివాడలో ఆదివారం గాంధీ జయంతిని పురస్కరించుకుని మద్యపానరహిత సమాజంగా తీర్చిదిద్దాలని మహిళలు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మద్యం వద్దు ఆరోగ్యం ముద్దు అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మద్యం వల్ల అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ జయంతి ఒక రోజుకే మద్యం షాపులు బంద్ చేసి మిగతా రోజుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరపడంతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్యం మహమ్మారిని పూర్తిగా నిషేధించినప్పుడే జాతిపితకు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక పోరాట నాయకులు వల్లూరి పద్మ, వేమగిరి తలుపులియ్య, వేమగిరి, మరియమ్మ, గౌరి, వెంకటలక్ష్మి, చిన్నారి, భవాని పాల్గొన్నారు.

జిఎంసి బాలయోగికి ఘన నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు


తాళ్లరేవులో నివాళులర్పిస్తున్న నాయకులు

కోనసీమతో పాటు జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మాజీ పార్లమెంట్ స్పీకర్ జిఎంసి బాలయోగి సేవలు ఆదర్శనీయమని పలువురు తెలుగుదేశం నేతలు అన్నారు. బాలయోగి 72వ జయంతి సందర్భంగా తాళ్లరేవు, నీలపల్లి, యానాం వారధి వద్ద బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా తాళ్ళరేవు అంబేద్కర్ భవనం వద్ద బాలయోగి విగ్రహానికి టిడిపి నాయకులు జక్కల ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు నివాళులర్పించారు. నీలపల్లిలో చిట్టూరి కలికి మూర్తి, యానాం వారధి వద్ద ఉన్న బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాట్ల పృథ్వి, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, జక్కల ప్రసాద్ బాబు, మోపూరి వెంకటేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, గంజా సూరిబాబు, గంట గోపి, వస్కా రెడ్డి, వెంటపల్లి చంద్రమౌళి, వాసంశెట్టి శ్రీనివాస్, రోళ్ల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్‌లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగానికి చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థి కె.దుర్గాప్రసాద్ జూనియర్ అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రతిభ చూపాడు. ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరు ఆధ్వర్యంలో ఐజిఎంసి స్టేడియం విజయవాడలో నిర్వహించిన 36వ ఎపి రాష్ట్ర స్థాయి అండర్-23 జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 400 మీటర్ల రన్నింగ్ రిలేలో సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. దుర్గాప్రసాద్‌ను ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి జి.ప్రతాప్ రెడ్డి, కోచ్ వి.అఖిల్ అభినందించారు.

సర్పంచ్ సూరిబాబు ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు


రక్తదానం చేస్తున్న యువకులు, సర్పంచ్ సూరిబాబు

రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలను కాపాడ గలమని జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు అన్నారు. జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా జి.వేమవరంలో పుణ్యమంతుల సత్తిబాబు ఆర్థిక సహకారంతో సర్పంచ్ సూరిబాబు, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకుల శిబిరానికి చేరుకుని ఉత్సాహంగా రక్తదానం చేశారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలో రక్తం ఎంతో అవసరం ఉందని కాకినాడ ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ శ్రీహరిబాబు తెలిపారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన యువకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చింతా నారాయణమూర్తి, స్థానిక యువకులు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

దిగిరాని అల్లం ధర.. కేజీ రూ.150

మండపేట : నెలలు గడుస్తున్న అల్లం ధర కిందకు దిగి రావడం లేదు. హోల్ సేల్ మార్కెట్లో కేజీ రూ.120 కాగా రిటైల్ మార్కెట్‌లో కేజీ రూ.150కి పైగా పలుకుతోంది. ప్రధానంగా ప్రజల అవసరాల మేరకు స్థానికంగా అల్లం అందుబాటులో లేదు. దీంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో అల్లం ధర అధికంగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధాన మార్కెట్లో కేజీ రూ.150 నుంచి రూ.160 పలుకుతోంది.

ఇండోర్ గేమ్స్‌పై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఇండోర్ గేమ్స్, కథలు చదవడం, సమీక్షలు చేయడం వంటి కార్యక్రమాలపై బాలలకు ఆదివారం మాధవపట్నంలోని జమునానగర్ కాలనీ బాల మందిరంలో నిర్వహించారు. బాల మందిరం వ్యవస్థాపకులు అంగర గోపాలకృష్ణ అధ్యక్షతన మెంటార్ హేమంత్ విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించగా, కాప్ప టీచర్ వీరబాబు విద్యార్థులకు చిత్రలేఖనం, ఒరిగామి అంశాలపై తరగుతులు నిర్వహించారు. దసరా సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు కృష్ణశ్రీ తెలిపారు. ఈ నెల 14, 15 తేదీలు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్, చెస్ విభాగాల్లో ఈ ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - అంబాజీపేట

సంక్షేమ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు బిసి హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం హాస్టల్ వసతులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాంద్రేగల శ్రీనివాసరావు, పేరి శ్రీను, పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యవేణి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

యానాం వార్తలు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జయప్రకాష్ నారాయణ, లక్ష్మీనారాయణ

ఘనంగా ఓల్డేజ్ హోమ్ రజతోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో యానాం వద్ధాశ్రమ 25 వసంతాల వేడుక ఘనంగా నిర్వహించారు. యానాం వద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాడి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా లోక్ సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ, సిబిఐ మాజీ డైరెక్టర్ జెడి.లక్ష్మీనారాయణ, న్యూఢిల్లీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అన్నురసు, వైజాగ్ ప్రొఫైల్ చైర్మన్ ఇ.శంకర్రావు హాజరయ్యారు. యానాం వద్ధాశ్రమాన్ని సందర్శించిన వీరు పలు నూతన వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులతో మాట్లాడారు. అనంతరం అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథులు మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను వృద్ధాశ్రమ నిర్వహణ కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పెసల గిడ్ల చంద్రరావు, పెండెం సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న అధికారులు

ఘనంగా జిఎంసి బాలయోగి జయంతి

ప్రజాశక్తి - యానాం

యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో జిఎంసి బాలయోగి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పరిపాలన అధికారి కార్యాలయం సమీపంలో ఉన్న బాలయోగి విగ్రహానికి సిఐ షణ్ముగం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి గణేషన్, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, చెక్కల అరుణ్ కుమార్, కెఎల్‌వి.ప్రసాద్, రాజు పాల్గొన్నారు.